రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలి

● మంత్రులు తుమ్మల, కోమటిరెడ్డి ● లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకున్న మంత్రులు



మంత్రులకు వేద ఆశీర్వచనం చేస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, సెప్టెంబర్ 22 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని, పాడి పంటలతో రైతులు ఆనందంగా జీవించాలని రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యతో కలిసి ఆదివారం లక్ష్మీ నర్సింహస్వామిని దర్శించుకున్నారు. కొండ పైన మాఢవీధుల్లో అఖండ దీపారాధనలో పాల్గొన్నారు. అనంతరం ముఖ మండపంలో ధ్వజ స్తంభాన్ని, స్వయంభూ పంచనారసింహస్వామిని దర్శించుకుని పూజలు జరిపారు. ముఖ మండపంలో ఆలయ ప్రధానార్చకులు, వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా.. అలయ ఈఓ భాస్కర్ రావు ప్రసాదాన్ని అందజేసి, స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంతోపాటు హైదరాబాద్ చిత్రపటం ప్రపంచంలో నిలిచే విధంగా కృషి చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన యాదగిరిగుట్ట ఆలయ అంకురార్పణలో తాను కూడా భాగస్వామిగా ఉన్నట్లు మంత్రి తుమ్మల గుర్తు చేశారు. లక్ష్మీనరసింహస్వామి ఆశీస్సులు తెలంగాణకే కాకుండా దేశం మొత్తానికి ఉండాలని కోరుకున్నట్లు వెల్లడించారు. వారి వెంట కలెక్టర్ హనుమంతు కె.జెండగే, డీసీపీ రాజేశ్‌చంద్ర, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

వైద్య శిబిరంలో పాల్గొన్న మంత్రులు

శ్రీఆర్కే హాస్పిటల్, చావా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని వంగపల్లి గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పాల్గొన్నారు. గ్రామానికి చెందిన 200 మందికి పైగా పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేసినట్లు వైద్య శిబిరం ఆర్గనైజర్లు బాలరాజు, అనిల్ తెలిపారు.

యాదగిరిగుట్టలో భక్తుల సందడి

మాఢవీధుల్లో భక్తులు

యాదగిరిగుట్ట, సెప్టెంబర్ 22 : యాదగిరిగుట్ట పంచనారసింహస్వామి క్షేత్రంలో భక్తుల సందడి నెలకొన్నది. ఆదివారం సెలవు కావడంతో స్వయంభూ నారసింహుడిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. మాఢ వీధులు, క్యూ కాంప్లెక్స్, క్యూలైన్లు, తిరు మాఢవీధులు, గర్భాలయ ముఖ మండపంలోని క్యూలైన్లు భక్తులతో సందడిగా మారాయి. స్వామివారి ధర్మ దర్శనానికి 2గంటలు, వీఐపీ దర్శనానికి గంట సమయం పట్టిందని భక్తులు తెలిపారు. తెల్లవారుజామున స్వామివారికి సుప్రభాత సేవను నిర్వహించారు. తిరువారాధన నిర్వహించి, ఉదయం ఆరగింపు చేపట్టారు. స్వామివారికి నిజాభిషేకం, తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయస్వామికి సహస్రనామార్చన చేపట్టారు. స్వామి, అమ్మవార్లకు ఉదయం సుదర్శన నారసింహ హోమంలో భాగంగా సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ హోమం జరిపారు. ప్రాకార మండపంలో స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిపారు. కల్యాణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం వెండి మొక్కు జోడు సేవ, దర్బార్ సేవలో భక్తులు పాల్గొని తరించారు. పాతగుట్ట ఆలయంలో ఆర్జిత పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు నిరాటంకంగా కొనసాగాయి. స్వామివారిని సుమారు 23వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. స్వామివారి ఖజానాకు రూ.30,75,287 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

స్వామివారిని దర్శించుకున్న విదేశీయులు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామిని బెల్జియం, లండన్ దేశస్తులు దర్శించుకున్నారు. ఆదివారం యాదగిరిగుట్ట కొండపైకి చేరుకున్న వారు వీఐపీ క్యూలైన్ గుండా స్వయంభూ పంచనారసింహస్వామిని దర్శించుకుని పూజలు జరిపారు. అనంతరం ఆలయ పరిసరాలను వీక్షించారు.

సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సురేఖకు ఆహ్వాన పత్రిక అందిస్తున్న రమణేశ్వరం నిర్వాహకులు

శ్రీచక్ర మహా ఆలయ ఆవిష్కరణకు రావాలని ముఖ్యమంత్రికి ఆహ్వానం

భువనగిరి కలెక్టరేట్, సెప్టెంబర్ 22 : మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామ పరిధిలోని యువశక్తి అనుగ్రహ మహాపీఠం రమణేశ్వరంలో అక్టోబర్ 16న నిర్వహించనున్న శ్రీచక్ర మహా ఆలయ ఆవిష్కరణకు రావాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు ఆహ్వాన పత్రిక అందజేసినట్లు రమణేశ్వరం నిర్వాహకులు బలరాం తెలిపారు. హైదరాబాద్‌లోని సీఎం కార్యాలయంలో ఆదివారం ముఖ్యమంత్రి, మంత్రిని కలిసి ఆలయ విశిష్టతలను తెలియజేస్తూ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి రావాలని కోరినట్లు చెప్పారు.

నోటితో నవ్వుతూ.. నొసటితో వెక్కిరించేలా...

● ఆలోచింపజేస్తున్న కార్టూన్



హరికిషన్ వేసిన కార్టూన్

రామన్నపేట, సెప్టెంబర్ 22 : ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ల సర్దుబాటు నేపథ్యంలో మండల కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు, కవి, కార్టూనిస్టు పాల్వంచ హరికిషన్ వేసిన కార్టూన్ అందరినీ ఆలోచింపజేసేలా ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో టీచర్ల సర్దుబాటు నేపథ్యాన్ని తీసుకొని ప్రభుత్వం ఒకవైపు ప్రతి ఊరిలో బడి ఉండాలంటూనే విద్యార్థుల రేషియో పేరుతో టీచర్ల సర్దుబాటు చేసే ఆలోచన చేయడం పాఠశాలల మనుగడకు విఘాతం కల్గిస్తుందనే ఉద్దేశంతో ఈ కార్టూన్ వేశారు. ప్రభుత్వ ఆలోచన నోటితో నవ్వుతూ నొసటితో వెక్కిరించేలా.. ఉందని తాను వేసిన కార్టూన్ ద్వారా హరికిషన్ తెలిపారు.

ఆలేరును రెవెన్యూ డివిజన్ చేయాలి

● మంత్రి కోమటిరెడ్డికి ఆలేరు రెవెన్యూ డివిజన్ సాధన పోరాట కమిటీ వినతి

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న రెవెన్యూ డివిజన్ సాధన పోరాట కమిటీ నాయకులు

ఆలేరు టౌన్, సెప్టెంబర్ 22 : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఆలేరును వెంటనే రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని ఆలేరు రెవెన్యూ డివిజన్ సాధన పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఆలేరులో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలేరును రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఈ ప్రాంత చిరకాల స్వప్నం నెరవేర్చాలని కోరారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆలేరు రెవెన్యూ డివిజన్ సాధన పోరాట కమిటీ కన్వీనర్ పసునూరి వీరేశం, సభ్యులు ఆర్.జనార్దన్, చెక్క వెంకటేశ్ బాంబే రవి, ఇక్కిరి సహదేవ్, ఇక్కిరి కుమార్, మొరిగాడి చంద్రశేఖర్, పంగ రవి, నర్సింహులు, ప్రకాశ్, అంజిబాబు, అశోక్, వెంకటేశ్, మోతీలాల్, సత్యం, జగన్, శ్రీనివాస్, రాజు, మణికంఠ పాల్గొన్నారు.

గుండె గండిపడితేనే గొప్ప కవిత్వం పుడుతుంది

● రచయిత బైస దేవదాస్

సాహిత్య పురస్కారాలు అందుకున్న కవులు

ఆలేరు టౌన్, సెప్టెంబర్ 22 : కవిత్వం పుట్టడానికి మనోవేదన ఎంతగానో దోహదపడుతుందని కవి, రచయిత బైస దేవదాస్ అన్నారు. గుర్రం జాషువా, బోయి భీమన్న, దున్న ఇద్దాసు, చిలకమర్తి జయంతులను పుస్కరించుకొని మున్సిపాలిటీలోని రామకృష్ణ విద్యాలయంలో సమరసత వేదిక నల్లగొండ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కవిత్వం సామాజిక చైతన్యం కోసం ఉపయోగపడాలన్నారు. గుర్రం జాషువా వంటి కవులు అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం తమ కలాన్ని అర్పించారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రముఖ సాహితీవేత్తలు మౌనశ్రీ మల్లిక్, అభినయ శ్రీనివాస్, ఎం.ధనుంజయ నాయక్, బేరి సునీతారా మ్మోహన్‌రెడ్డికి సమరసత వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి సాహిత్య పురస్కారాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో సమరసత వేదిక నల్లగొండ విభాగం కో కన్వీనర్ బండి రాజుల శంకర్, కవులు, రచయితలు దేవినేని అరవిందరాయుడు, బండారు జయశ్రీ, పెసరు లింగారెడ్డి, ఎస్ఎన్ చారి, డాక్టర్ పోరెడ్డి రంగయ్య, రామకృష్ణ విద్యాలయం ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కవి మల్లికార్జున్‌కు సన్మానం



మల్లికార్జున్‌ను సన్మానిస్తున్న సమరసత వేదిక నిర్వాహకులు

వలిగొండ, సెప్టెంబర్ 22 : ఆలేరులో సామాజిక సమరసత వేదిక నల్లగొండ విభాగ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కవి సమ్మేళనంలో వలిగొండకు చెందిన రెబ్బ మల్లికార్జున్ తాను రచించిన కవితను వినిపించి కవుల ప్రశంసలను అందుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనకు ప్రశంసా పత్రం అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో కవులు, రచయితలు పోరెడ్డి రంగయ్య, అభినవ శ్రీనివాస్, బండిరాజుల శంకర్, ధనుంజయనాయక్, మౌనశ్రీ మల్లిక్ పాల్గొన్నారు.

పోరాటాలతోనే హక్కులు సాధ్యం : సీపీఎం

మహాసభలో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు నర్సింహ

బీబీనగర్, సెప్టెంబర్ 22 : ఎర్రజెండా పోరాటాలతోనే దేశంలోని కార్మికుల హక్కులు, చట్టాలు, కూలీలకు కూలి రేట్లు సాధించబడ్డాయని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ అన్నారు. మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం జరిగిన పార్టీ పట్టణ 7వ మహాసభలో ఆయన మాట్లాడారు. ఎర్రజెండా రాజ్యంలోనే అందరికీ నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం అందుతుందని, సమానత్వం వస్తుందని అన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట ఫలితంగానే దున్నేవాడికే భూమి నినాదం పుట్టి వేలాది ఎకరాల భూములు పంచబడ్డాయని తెలిపారు. నాటి నుంచి నేటి వరకు పాలకులు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై సీపీఎం ముందు భాగాన నిలిచి పోరాడుతున్నదన్నారు. మతోన్మాద బీజేపీ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా, రాజ్యాంగ పరిరక్షణ కోసం అన్ని వర్గాల ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మహాసభలో సీపీఎం జిల్లా నాయకుడు కోమటిరెడ్డి చంద్రారెడ్డి, మండల కార్యదర్శి గాడి శ్రీనివాస్, నాయకులు సతీశ్‌కుమార్, శ్రీరాములు, శ్రీశైలం, సురేందర్, కిరణ్‌కుమార్, బాలయ్య, శ్రావణ్‌కుమార్, కొండల్ పాల్గొన్నారు.

పీఏసీఎస్ డైరెక్టర్ ఆండాలు మృతి

బీబీనగర్, సెప్టెంబర్ 22 : మండలంలోని కొండమడుగు గ్రామానికి చెందిన పీఏసీఎస్ డైరెక్టర్ కొంగల ఆండాలు ఆదివారం అనారోగ్యంతో మృతిచెందారు. సొసైటీ చైర్మన్ మెట్టు శ్రీనివాస్‌రెడ్డి ఆండాలు కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆమె పార్థివదేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు. నివాళి అర్పించిన వారిలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ వాకిటి సంజీవరెడ్డి, డైరెక్టర్లు చింతల శ్రీనివాస్‌రెడ్డి, పంజాల సత్తయ్యగౌడ్, సురకంటి బాల్‌రెడ్డి, సంకూరి నాగరాజు, సీఈఓ శివ, మాజీ సర్పంచ్ కడెం లత, నాయకులు పంజాల రామాంజనేయులుగౌడ్, కురిమిండ్ల కృష్ణారెడ్డి ఉన్నారు.

వ్యక్తి అదృశ్యం

వలిగొండ, సెప్టెంబర్ 22 : మండల కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. అతని భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మండల కేంద్రానికి చెందిన బాలగోని మాధవ్ (45) ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఆయన శుక్రవారం సాయంత్రం 5గంటలకు ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల, బంధువుల ఇండ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో మాధవ్ భార్య ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసుగా నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ యుగంధర్ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

వలిగొండ, సెప్టెంబర్ 22 : అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకొని సీజ్ చేశారు. భువనగిరి మండలం సూరేపల్లి పీబీ తండాకు చెందిన ముడావత్ రెడ్యా, రెడ్యానాయక్ తండాకు చెందిన భుక్యా శ్రీను వలిగొండ మండలంలోని వివిధ గ్రామాల్లో నిరుపేదల నుంచి పీడీఎస్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. వాటితో అక్రమ వ్యాపారం చేస్తున్నారన్న సమాచారం మేరకు స్థానిక పోలీసులు ఆదివారం దాడి చేసి పట్టుకున్నారు. ద్విచక్ర వాహనాల మీద బియ్యం తరలిస్తున్న వారిని అదుపులోకి తీసుకొని 3క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేశారు. నిందితులపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ యుగంధర్ తెలిపారు.

పిడుగుపాటుకు గేదె మృతి

భువనగిరి కలెక్టరేట్, సెప్టెంబర్ 22 : మండలంలోని అనంతారం గ్రామంలో శనివారం రాత్రి పిడుగుపాటుకు గురై గేదె మృతిచెందింది. గ్రామానికి చెందిన కర్రె మల్లయ్యకు చెందిన గేదె వ్యవసాయ బావి వద్ద ఉండగా పక్కనే పిడుగు పడడంతో మృత్యువాత పడింది. దాని విలువ సుమారు లక్ష రూపాయలు ఉంటుందని బాధితుడు మల్లయ్య తెలిపాడు. ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి పంచనామా నిర్వహించారు.

'బీకేఎస్ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి'

బొమ్మలరామారం, సెప్టెంబర్ 22 : జిల్లా కేంద్రంలో అక్టోబర్ 2న నిర్వహించే భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి కాటం ఐలేశ్‌యాదవ్ అన్నారు. మండలంలోని చీకటిమామిడి గ్రామంలో ఆదివారం ఆయన ఆధ్వర్యంలో బీకేఎస్ మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా దేశెట్టి సత్యనారాయణ, వనం రవీందర్, ఉపాధ్యక్షుడిగా తుమ్మల ఉపేందర్, సహాయ కార్యదర్శిగా నాచన్నగారి చంద్రారెడ్డి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో రైతు నాయకులు ఉప్పల పెంటారెడ్డి, బెజ్జెంకి పాపిరెడ్డి, అంజిరెడ్డి పాల్గొన్నారు.

చౌటుప్పల్‌లో స్వచ్ఛ కార్యక్రమం

చౌటుప్పల్ రూరల్, సెప్టెంబర్ 22 : మున్సిపాలిటీలోని బీసీ కాలనీలో మున్సిపల్ సిబ్బంది ఆదివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. తడి, పొడి చెత్తను వేరుచేసి మున్సిపల్ వాహనాలకు ఇవ్వాలని సూచించారు.

కాలనీవాసులతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయిస్తున్న మున్సిపల్ సిబ్బంది

స్వర్ణగిరి క్షేత్రంలో విశేష పూజలు

స్వామి, అమ్మవార్లకు కల్యాణ తంతు నిర్వహిస్తున్న అర్చకులు

యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్ 22 (నమస్తే తెలంగాణ) : భువనగిరి మున్సిపాలిటీ పరిధిలోని స్వర్ణగిరి వేంకటేశ్వర స్వామి క్షేత్రంలో ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం అర్చకులు సుప్రభాత సేవ, నిత్యారాధనలు ఘనంగా నిర్వహించారు. స్వామివారిని వేయి నామాలతో స్తుతిస్తూ సహస్రనామార్చ సేవను విశేషంగా నిర్వహించారు. సుదర్శన నారసింహ హవనాన్ని చేపట్టారు. పద్మావతీ గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభంగా నిర్వహించారు. సాయంత్రం మాఢవీధుల్లో గోవింద నామస్మరణలతో స్వామివారిని ఊరేగించి.. తిరువీధి ఉత్సవ సేవను నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లు సహస్ర దీపాల మధ్యలో ఊయలలో ఆసీనులై భక్తులకు దర్శనమిచ్చారు.

జమిలీ ఎన్నికలు రాజ్యాంగ విరుద్ధం

● సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్

మహాసభలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్

రామన్నపేట, సెప్టెంబర్ 22 : జమిలీ ఎన్నికల పేరుతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ విలువల్ని ధ్వంసం చేసేందుకు యత్నింస్తుందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం జరిగిన సీపీఎం పట్టణ 17వ మహాసభలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఒకే దేశం, ఒకే ఎన్నిక పేరుతో ప్రజలను గందరగోళ పరిచే కుట్ర చేస్తుందన్నారు. భారతదేశం విభిన్న సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా ఉన్నదని తెలిపారు. ఆర్ఎస్ఎస్ వ్యక్తిగత ఎజెండాను దేశం మీద రుద్దే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. జమిలీ ఎన్నికల కుట్రను ప్రజలు తిరస్కరించాలని పిలుపునిచ్చారు. అనంతరం పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా మునుకుంట్ల లెనిన్, సహాయ కార్యదర్శిగా కందుల హన్మంతు ఎన్నికయ్యారు. సీపీఎం జిల్లా నాయకులు మేక అశోక్‌రెడ్డి, జెల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, నాయకులు గాదె నరేందర్, మామిడి వెంకట్‌రెడ్డి, బాలరాజు, సోములు, జగతయ్య, ఆంజనేయులు, సత్యం పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి సాయం

సంస్థాన్ నారాయణపురం : వీరయ్య చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సంస్థాన్ నారాయణపురం, సెప్టెంబర్ 22 : మండలంలోని సర్వేల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కట్టెల వీరయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. పేదలైన వీరయ్య కుటుంబానికి అదే గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు ఆదివారం వంద కిలోల బియ్యం, 5వేల రూపాయలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు నలపరాజు స్వామి, కట్టెల భిక్షపతి, రమేశ్, జగన్‌రెడ్డి, జంగయ్య, మల్లేశ్, నాగార్జున పాల్గొన్నారు.

స్నేహితుల ఆర్థిక సాయం

ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రానికి చెందిన యువకుడు బూడిద రవి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. రవితో కలిసి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 2007-08 సంవత్సరం విద్యార్థులు ఆదివారం రూ.30వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో శ్రీకాంత్, శ్యామ్, కుమార్, రవి, నరేశ్, నర్సింహ, రాంబాబు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

బీబీనగర్, సెప్టెంబర్ 22 : మండలంలోని కొండమడుగు గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999-2000 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం జరుపుకొన్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులు వెంకట్‌రెడ్డి, ఆంజనేయులు, శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణ, వసుంధర, సత్తిరెడ్డి, శ్రీనివాస్‌ను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు మొరిగాడి బాలరాజుగౌడ్, చెరుకు భాస్కర్‌గౌడ్, శివశంకర్, సంజీవరెడ్డి, కొండల్‌రెడ్డి, శ్రీరాములు, శ్రీకాంత్, శ్రీశైలం, బాలరాజు, జెల్లి రాజు, వెంకటేశ్, మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా గణనాథుడి శోభాయాత్ర

శివాజీనగర్‌లో శోభాయాత్రలో కోలాటం ఆడుతున్న మహిళలు

ఆత్మకూరు(ఎం), సెప్టెంబర్ 22 : మండల కేంద్రంలోని రాంనగర్ కాలనీ, శివాజీనగర్‌లోని మారెమ్మ దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలతోపాటు రహీంఖాన్‌పేటలో 7యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణనాథుడి శోభాయాత్ర శనివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. శోభాయాత్రలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య పాల్గొని పూజలు చేశారు. నిర్వహణ కమిటీ సభ్యులు మురళీకృష్ణ, నవీన్, శ్రీను, భాస్కర్, కార్తీక్ పాల్గొన్నారు.

మహిళా భక్తులకు చీరెలు పంపిణీ

ఆత్మకూర్ (ఎం) మండల కేంద్రంలోని ఓల్డ్‌సిటీ గణేశ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మహిళా భక్తులకు అందజేసిన చీరెలను మాజీ సర్పంచ్ జన్నాయికొడె నగేశ్ ఆదివారం పంపిణీ చేశారు. గణేశ్ నిమజ్జనాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు లోడి మహేశ్, దాతలు సత్యనారాయణ, కర్ణాకర్, బలరాం, లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్

శ్రీనివాస్‌కు నియామక పత్రం అందజేస్తున్న ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్

బీబీనగర్, సెప్టెంబర్ 22 : ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడిగా మల్లగారి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. యాదగిరిగుట్ట సమీపంలోని సురేంద్రపురిలోని వాసవీ సత్రంలో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అగిర్ వెంకటేశ్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. అనంతరం ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఆయన 2024 -26 వరకు (రెండు సంవత్సరాలు) అధ్యక్షుడిగా కొనసాగనున్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహాసభ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు సరాబు లక్ష్మణ్, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు ఇరుకుల రామకృష్ణ పాల్గొన్నారు.

'ఎన్నికల వాగ్దానాలను అమలు చేయాలి'

మోత్కూరు, సెప్టెంబర్ 22 : కాంగ్రెస్ ఇచ్చిన ఎన్నికల వాగ్దానాలను అమలు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొల్లు యాదగిరి డిమాండ్ చేశారు. ఆదివారం జరిగిన కొండగడప, బుజిలాపురం పార్టీ గ్రామ శాఖల సమావేశాల్లో ఆయన మాట్లాడారు. వానకాలం పంటల సాగు పూర్తవుతున్నా రైతు భరోసా ఇవ్వడం లేదన్నారు. రూ.2లక్షల రుణమాఫీని రైతులందరికీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కమిటీలను ఎన్నుకున్నారు. కొండగడప గ్రామ శాఖ కార్యదర్శిగా లెంకల యాదగిరి, బుజిలాపురం గ్రామ శాఖ కార్యదర్శిగా మాంద్ర చంద్రయ్య ఎన్నికయ్యారు. సమావేశాల్లో సీపీఎం నాయకులు చింతల కృష్ణారెడ్డి, పైళ్ల యాదిరెడ్డి, నంద్యాల ఉపేందర్‌రెడ్డి, గిరగాని సత్తయ్య పాల్గొన్నారు.

మార్కెట్ వైస్ చైర్మన్ మదార్‌గౌడ్‌కు సన్మానం

మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మదార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఆత్మకూరు(ఎం), సెప్టెంబర్ 22 : పూర్వ ఆత్మకూరు(ఎం) మండలంలోని కాటేపల్లి గ్రామానికి చెందిన పచ్చిమట్ల మదార్‌గౌడ్ ఆలేరు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మదార్‌గౌడ్‌ను కాంగ్రెస్ నాయకులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ జిల్లాల శేఖర్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు యాస లక్ష్మారెడ్డి, నాయకులు నగేశ్, సిద్ధులు, ఉప్పలయ్య, వెంకటేశ్వర్లు, మల్లేశం పాల్గొన్నారు.

డైరెక్టర్ బాలరాజుగౌడ్‌కు సన్మానం

మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాలరాజుగౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

రాజాపేట, సెప్టెంబర్ 22 : ఆలేరు మార్కెట్ కమిటీ డై